క్లుప్తంగా

13 నుంచి కార్తీక మాసోత్సవాలు

పీసీపల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడులోని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 13 నుంచి కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు పలుకూరి సుబ్బారావు తెలిపారు. ఈ నెల 13 నుంచి వచ్చే నెల 12 వరకు కార్తీక మాసం సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. 27న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని లక్ష దీపోత్సవం ఉంటుందన్నారు. 13 నుంచి మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

5న విజేతలకు బహుమతుల పంపిణీ

కనిగిరి రూరల్: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన తదితర పోటీల్లోని విజేతలకు ఈనెల 5న ఆదివారం బహుమతులు పంపిణీ, అభినందన కార్యక్రమం జరుగుతుందని జిల్లా ఆధ్యాత్మిక కో ఆర్డినేటర్ జి.బుల్లి అంకమ్మరావు తెలిపారు. స్థానిక కోదండరామ స్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు బహుమతులు, ధృవీకరణ పత్రాలు అందజేస్తామన్నారు.

నేడు టిడ్కో ఇళ్ల పంపిణీ

కందుకూరు : సకల మౌలిక వసతులతో సిద్ధమైన టిడ్కో ఇళ్లను శుక్రవారం లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఉప్పుచెరువులోని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు ప్రాంతంలో నిర్మించిన 1408 ఇళ్లను లాంఛనంగా ప్రారంభించి, లబిదారులకు ఇళ్ల తాళాలు అందజేయనున్నారు. ఈ వేడుకకి మంత్రులు ఆదిమూలపు సురేష్, కాకాణి గోవర్ధన్‌రెడ్డిలతో పలువురు ప్రముఖులు, జిల్లా ఉన్నతాధికారులను ఆహ్వానించారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సమక్షంలో జరిగే వేడుకకు లబ్ధిదారులంతా హాజరుకావాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫి విజ్ఞప్తి చేశారు.

5లోగా పింఛను పంపిణీ చేయాలి

మర్రిపూడి: మండలంలోని పింఛనుదారులకు ఈ నెల 5వ తేదీలోగా వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ చేయాలని ఎంపీడీఓ ఎస్.సుదీపా గురువారం వలంటీర్లకు సూచించారు. మండలంలోని 21 పంచాయతీల పరిధిలో 5645 మంది పింఛనుదారులు ఉన్నారని, వీరికి అక్టోబర్ మాసానికి సంబంధించిన వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.1,57,75,000 విడుదల చేసినట్లు తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 76.2 శాతం పింఛను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. వేలిముద్రలు పడని వారికి సచివాలయాలల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా అందజేస్తామని స్పష్టం చేశారు.

సాఫ్ట్‌బాల్ జట్టుకు కె.బిట్రగుంట విద్యార్థి ఎంపిక


బన్నీతో పాఠశాల ఉపాధ్యాయులు

జరుగుమల్లి: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు మండల పరిధిలోని కె.బిట్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కేవీ బన్నీ ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్ఎం ఇ.శ్రీనివాస్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండలం మంగమూరులో నిర్వహించిన పోటీల్లో అండర్ 17 విభాగంలో బన్నీ సత్తా చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని వివరించారు. నవంబరు 4 నుంచి 6వ తేదీ వరకు ఒంగోలులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని పీడీ బి.శ్రీనివాసులు తెలిపారు.

200 మందికి ఆయుర్వేద వైద్య పరీక్షలు


ఆలకూరపాడులో ఆయుర్వేద మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

టంగుటూరు: మండలంలోని ఆలకూరపాడు సాయిబాబా ఆలయ ప్రాంగణంలో విష జ్వరాలపై అవగాహన, వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. విష జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. వైద్యులు ప్రియాంక, కరుణాకరరావు, సిబ్బంది శ్రీహరి పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టును త్వరగా ప్రారంభించాలి

పెద్దారవీడు: వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి పశ్చిమ ప్రకాశానికి సాగు, తాగు నీరు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు దగ్గుపాటి సోమయ్య కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు గురువారం ధర్నా చేశారు. అనంతరం వినతిపత్రం తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డికి అందజేశారు.

కొండపి నియోజకవర్గంలో సైకిల్‌కు పంక్చర్

- టీడీపీ తీరు నచ్చక వైఎస్సార్ సీపీలోకి చేరికల వెల్లువ
- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు


ముస్లింలను కండువా కప్పి ఆహ్వానిస్తున్న వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: టంగుటూరుకు చెందిన ముస్లిం మైనారిటీ కుటుంబాలు గత 30 ఏళ్లుగా టీడీపీలో ఉంటూ అభివృద్ధి, సంక్షేమానికి నోచుకోక విసుగు చెందారని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ పాలన చూసి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో 20 ముస్లిం మైనారిటీ కుటుంబాలకు చెందిన 50 మంది వరికూటి అశోక్‌బాబు సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, పార్టీ మండల అధ్యక్షులు మల్లవరపు రాఘవరెడ్డి, రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, రాష్ట్ర సర్పంచుల సంఘ అధ్యక్షుడు ఆనం సత్యనారాయణరెడ్డి, కొండపి ఏఎంసీ డైరెక్టర్లు కొమ్ము సురేంద్ర, టంగుటూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి


కనిగిరిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్


హనుమంతునిపాడులో : మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కాంప్లెక్స్ చైర్మన్

హనుమంతునిపాడు: జగనన్న గోరుముద్దలో భాగంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో మెనూ సక్రమంగా అమలు చేయాలని కాంప్లెక్స్ చైర్మన్ జీవి.సురేష్‌బాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో గురువారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మెనూ తూచా తప్పకుండా అమలు చేయాలన్నారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలని, వంట చేసిన తరువాత పాత్రలపై మూతలు ఉంచాలని కుకింగ్ ఏజెన్సీలకు సూచించారు.

కనిగిరి రూరల్: మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు వరం లాంటిదని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ఆయన పరిశీలించి, హాజరు పట్టికను, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందచేయాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎండీఎం పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రభుత్వం అందచేసే పౌష్టికాహారాన్ని ప్రతి విద్యార్థికి విధిగా అందచేయాలని తెలిపారు. అనంతరం కిచెన్స్ షెడ్స్‌ను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టి. పద్మజారాణి, ఉపాధ్యాయులు యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు త్వరితగతిన రికవరీ చేయాలి



మాట్లాడుతున్న స్త్రీనిధి తనిఖీ టీమ్ అధికారి

హనుమంతునిపాడు: డ్వాక్రా సంఘాల సభ్యులు తీసుకున్న స్త్రీ నిధి బకాయిలు త్వరితగతిన రికవరీ చేయాలని సెర్ప్ ప్రత్యేక టీం అధికారి జి.వెంకట ప్రకాష్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సెర్ప్ ఆధ్వర్యంలో స్త్రీ నిధి టీంఅధికారులు రుణాలు, రికవరీ, బకాయిల రికార్డులు తనిఖీ చేశారు. ముందుగా స్త్రీ నిధి రుణాల రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన డ్వాక్రా సంఘాల వీఓఏలతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 2018 నుంచి 2023 వరకు 14 సచివాలయాల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలోని 250 పొదుపు సంఘాల్లోని 979 మందికి సభ్యులకు రూ.5.65 కోట్లు బ్యాంకు ఇవ్వగా రూ.1.5 కోట్లు మాత్రమే రికవరీ చేశారన్నారు. మిగిలిన సొమ్ము రికవరీ చేయాలన్నారు. రికవరీలో జాప్యం చేస్తే సీసీలు, వీఓఏలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రికవరీ చేసిన సంఘాల్లోని సభ్యులకు మాత్రమే తిరిగి రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఏ నారాయణ, సీసీలు, శ్రీను, అశోక్, రాజు, గీతా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

సంక్షేమమే ఇంటికి వస్తోంది

జరుగుమల్లి: అర్హులైతే చాలు సంక్షేమమే ఇంటికి వస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి మాటలు అక్షర సత్యాలని ఎంపీడీఓ కె.జలజాక్షి పేర్కొన్నారు. మండల కేంద్రమైన జరుగుమల్లిలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జరుగుమల్లి సచివాలయ సెక్రటరీ రామ్మోహనరావుతో కలిసి పింఛన్ల పంపిణీని పరిశీలించారు. మండలంలో పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తయిందని ఎంపీడీఓ పేర్కొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం


హజరత్ జెండా ఊరేగింపు

కనిగిరి రూరల్: హజరత్ మహబూబ్ సుభాని గంధ మహోత్సవ వేడుకలను గురువారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పదో వార్డు (పాతూరు)లో ఉన్న మహబూబ్ సుభాని దర్గాను గంధ మహోత్సవం (ఉరుసు) సందర్భంగా విద్యుత్ దీప, పూల అలంకరణలతో బహు సుందరంగా తీర్చిదిద్దారు. హజరత్ వారి జెండాను తప్పెట్ల తాళాలతో పట్టణ పుర వీధుల్లో ఊరేగించారు. ఉరుసు సందర్భంగా దర్గా వద్దకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఎంతో భక్తి శ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించి, ప్రార్థనలు చేశారు.

జూడో పోటీల్లో కామేపల్లి విద్యార్థుల ప్రతిభ


కాంస్య పతకం సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జరుగుమల్లి: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో కామేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కాంస్య పతకం సాధించినట్లు హెచ్ఎం ఎల్.అనూరాధ తెలిపారు. అక్టోబరు 28 నుంచి 30వ తేదీ వరకు సత్య సాయి జిల్లా ధర్మవరం మండలం చిగిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జూడో పోటీలలో ఎం.ఈశ్వర్ చరణ్, కె.జస్వంత్ కుమార్, బి.బ్రాహ్మణి, కె.ప్రవల్లిక, వై.లావణ్య, ఎన్.విగ్నేష్ మణికంఠ ప్రతిభ కనపరచారని వివరించారు. వీరిలో బి.బ్రాహ్మణి కాంస్య పతకం అందుకుందని చెప్పారు. హెచ్ఎంతోపాటు పీడీ నర్రా కోటేశ్వరరావు, మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

తల్లిదండ్రులకు మంత్రి ఘన నివాళి


తల్లిదండ్రుల సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

మార్కాపురం: ఆల్ సోల్స్ డే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో.. తల్లిదండ్రులైన శామ్యూల్ జార్జి, థెరీసమ్మకు ఘనంగా నివాళులర్పించారు. తలిదండ్రుల సమాధులను పూలతో అలంకరించి జార్జి గ్రీన్స్ నందు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం ఫాదర్ జాన్ అరేమ్, సిస్టర్స్, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా రక్షణబేరి సభను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు: పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన జరిగే ప్రజా రక్షణబేరి సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ఏ గౌస్ కోరారు. ప్రజా రక్షణ బేరి సభ ప్రచార వాల్‌పోస్టర్‌ను గురువారం స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం బస్సుయాత్ర జరుగుతుందని తెలిపారు. సీపీఎం నాయకులు డి రామ్మూర్తి, మున్వర్‌సుల్తానా, ఎస్‌కె మల్లిక, పద్మ, డిఎం రాయుడు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం


మందులు అందిస్తున్న వైస్ చైర్మన్ ఇస్మాయిల్, పార్టీ నాయకులు

మార్కాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ అన్నారు. గురువారం మార్కాపురం పట్టణంలోని 19 సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పెషలిస్టు డాక్టర్లు నేరుగా ఇళ్ల వద్దకు వచ్చి ఉచిత వైద్యసేవలు అందించడం రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారి అని అన్నారు. వైస్ చైర్మన్-2 అంజమ్మ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రోగులకు సురక్ష కార్డులు, మందులు అందించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి ముత్తారెడ్డి వెంకటరెడ్డి, కౌన్సిలర్ నగేష్, మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, డీఈ సుభానీ, ఏఈ రవీంద్రుడు, సీనియర్ డాక్టర్ రాహుల్, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

5న కంటి వైద్య శిబిరం

గిద్దలూరు రూరల్: శ్రీ వివేకానంద కళాశాలకు చెందిన 1983, 85, 88 సంవత్సరాలకు చెందిన పూర్వ విద్యార్థుల గెట్ టు గెదర్ సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శాంతి రామ్ వైద్యశాల ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ తులసీబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి చికిత్సలో భాగంగా వారికి ఉచితంగా కంటి అద్దాలు, ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ జట్టు కోచింగ్


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

దొనకొండ: స్కూల్ గేమ్స్ ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-17 బాలుర ఫుట్‌బాల్ జట్టుకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 రోజులుగా ఇస్తున్న శిక్షణ ముగిసింది. ఈ కోచింగ్ క్యాంప్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రీడాకారులు శిక్షణ పొందారని వ్యాయామ ఉపాధ్యాయుడు పి.నరసింహారావు తెలిపారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో నిర్వహించనున్న 67వ అంతర్ జిల్లా పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫున ఈ జట్టు పాల్గొంటుందని చెప్పారు. జట్టుకు వ్యాయామ ఉపాధ్యాయులు సాంబశివరావు, అంజిరెడ్డి, నరసింహారావు, అనిల్, రత్నం, ఖాశిం శిక్షణ ఇచ్చారని పేర్కొన్నారు.

నీటి వనరులను పొదుపుగా వాడుకోవాలి

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులు బోర్లకు సంబంధించిన నీటిని పొలాలకు పొదుపుగా వాడుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. మండలంలోని దారంవారిపాలెంలో క్షేత్ర పర్యటనలో భాగంగా బోర్లకింద సాగు చేసిన పంటలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

బాల్య వివాహ నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత


మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మజ

పామూరు: బాల్యవివాహ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణంలో ప్రజాప్రతినిదులు కీలకపాత్ర పోషించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మజ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో గురువారం సీడీపీవో సరోజిని అధ్యక్షతన బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా బాల్యవివాహాల నిషేధ చట్టం, 2006, జీవో ఎంఎస్‌నంబర్ 31 పై గ్రామ, మండల స్థాయి ప్రజాప్రతినిదులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పద్మజ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం సాంఘిక దురాచారమన్నారు. బాలల హక్కుల పరిరక్షణకోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, విద్యావ్యవస్థలో అనేక మార్పులుచేసి అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలు అమలుచేసి బాలల బంగారు భవితకు బాటలు వేశారన్నారు. బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. అమ్మాయి వయస్సు 18 ఏళ్లు, అబ్బాయి వయసు 21 ఏళ్లు నిండిన తరువాత మాత్రమే వివాహం చేయాలన్నారు. గ్రామాల్లో బాల్యవివాహాల నిరోధక కమిటీతో పాటు గ్రామ బాలల హక్కుల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. బాల్య వివాహాలు నిర్వహిస్తే, సహకరించిన వారికి జైలుశిక్ష, జరిమానా విధిస్తామన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతుంటే ఐసీడీఎస్, పోలీసుల దృష్టికి తీసుకుపోయి వాటిని నిలువరించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సరోజిని, తహసీల్దార్ ఆవుల సురేష్, ఎంఈఓ జి.కరుణకుమారి, కోఆప్షన్ నాయబ్‌రసూల్, ఈఓఆర్డీ శ్రీనివాసులు, గోళ్ల పద్మజ, పలువురు స్వచ్ఛందసంస్థ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ జట్టుకు టీఆర్ఆర్ విద్యార్థి


క్రీడాకారుడు హేమంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

కందుకూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ జట్టుకు టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన చదలవాడ హేమంత్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.నాగేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-19 బాస్కెట్ బాల్ జట్టుకు చిత్తూరు జిల్లా మదనపల్లిలో గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు 67వ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా జట్టులో టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఆరుగురు క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా జట్టు క్వార్టర్ ఫైనల్‌లో ఓడిపోయింది. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన చదలవాడ హేమంత్‌ను రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబర్‌లో పంజాబ్‌లో జరగనున్న 67వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ విద్యార్థికి శిక్షణ ఇచ్చిన కళాశాల పీడీ టి.సుబ్బారావును, క్రీడాకారుడిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ పేదలకు వరం


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సరస్వతి

జరుగుమల్లి: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేదల పాలిట వరమని జరుగుమల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ సరస్వతి పేర్కొన్నారు. మండల పరిధిలోని చిరికూరపాడు సచివాలయ పరిధిలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటింటికి వచ్చి ప్రజల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని, వారికి సకాలంలో వైద్యం అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. 148 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది తిరుపతమ్మ, తేజ, లిఖిత పాల్గొన్నారు.

సేవా సంస్థల సేవలు హర్షణీయం

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: పేదలకు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు మరువలేనివని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. గురువారం హార్ట్ లాండ్ గ్రేస్ హౌజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఆయన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులను గుర్తించి వారికి అన్ని విధాలా అండగా నిలిచేందుకు ట్రస్ట్ నిర్వాహకులు ఎనిబెర మమత బెంజిమెన్ ముందుకు రావడం అభినందనీయమని, తమ సేవా కార్యక్రమాలను ముమ్మరం చేయాలని, అందుకు తన సహకారం కూడా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం రూ.24.30 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఎల్ఓసీలను ఆయన పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, సార్ప్ సంస్థ ఏపీఎం ఎం.మరియబాబు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు


విద్యార్థి వెంగబాబు

కనిగిరి రూరల్: దసరా సెలవులకు ఇంటికి వచ్చి తిరిగి కాలేజీకి వెళ్లిన ఇంటర్ ఫస్ట్ విద్యార్థి బూచిరాజు వెంగబాబు అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం..పట్టణంలోని శివనగర్ కాలనీకి చెందిన బూచి రాజు పెద చెన్నయ్య కుమారుడు బి. వెంగబాబు ఒంగోలు సరస్వతి కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. దసరా సెలవులకు గత నెల 21న కనిగిరి వచ్చాయి. మరలా ఈనెల 1న తిరుగు ప్రయాయానికి స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో విజయవాడ వెళ్లే బస్సు ఎక్కాడు. విద్యార్థి వెంగబాబుకు కళాశాల ఫీజు, ఖర్చులకు రూ.11 వేలు నగదు కూడాఇచ్చినట్లు చెప్పారు. అయితే 1తేది సాయంత్ర కాలేజీకి ఫోన్ చేసి వెంగబాబు గూర్చి అడగ్గా.. కాలేజీకి రాలేదని సమాధానం చెప్పారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు కలిసి విద్యార్థి వెంగబాబు కోసం అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో కనిగిరి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సై మాధవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.